క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మణికొండ: కోకాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కోకాపేట, బాబుఖాన్, ఓషియన్ పార్క్, గూంచాహిల్స్ ఫీడర్ల పరిధిలో మంగళవారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ టి.సందీప్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగ దారులు గమనించాలని ఆయన కోరారు.

నేడు పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని పోచమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవాన్ని ఈ నెల 13న నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షులు డి.ఉమారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గణేష్ తెలిపారు. ఈ నెల 13న ఉదయం నుంచి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అభిషేకం, ధూప, దీప, నైవేద్య, కుంకుమార్చన, హారతులతో పాటు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ వార్షికోత్సవంలో ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని సూచించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



2కె రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, డీసీపీ నారాయణరెడ్డి తదితరులు

శంషాబాద్: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆర్‌జీఐఏ పీఎస్ నుంచి 2కె రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నడక, పరుగు ఆరోగ్యాన్ని ఎంతో మెరుగుపరుస్తాయన్నారు. కార్యక్రమంలో డీసీపీ నారాయణరెడ్డి, రాజేంద్రనగర్ ఆర్‌డీఓ చంద్రకళ, మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, నార్సింగి ఏఎంసీ చైర్మన్. డి. వెంకటేష్‌గౌడ్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల కోసం క్యూ

శంషాబాద్: కులవృత్తిదారులకు ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రూ. లక్ష ఆర్థికసాయం కోసం లబ్ధిదారులు ఆసక్తి చూపుతున్నారు. ఇందుకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి కావడంతో మీ సేవ కార్యాలయాల్లో వాటి కోసం దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతున్నాయి. మీ సేవ కార్యాలయాల నుంచి తహసీల్దార్ కార్యాలయానికి ఒక్క రోజులోనే వందల సంఖ్యలో దరఖాస్తులు అందాయి. దీంతో తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది ప్రస్తుతం కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు పరిశీలించడంలో బిజీగా ఉన్నారు.

వివాహిత అదృశ్యం



లక్ష్మి (ఫైల్)

శంషాబాద్: ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక శివాజీబస్తీకి చెందిన బెస్త లక్ష్మి (40) గత నెల 28న స్నేహితురాలి ఇంటికి వెళుతున్నట్లు భర్తకు ఫోన్ చేసి చెప్పి బయటికి వెళ్లింది. ఆమె ఇప్పటి వరకు తిరిగి రాకపోవడంతో పాటు ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. ఆమె కోసం గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో ఆమె భర్త మనోజ్‌కుమార్ సోమవారం ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చారిత్రక ప్రదేశాలపై విద్యార్థులకు అవగాహన

గోల్కొండ: తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చారిత్రక ప్రదేశాలు, కట్టడాలు ఎన్నో ఉన్నాయని ప్రముఖ విద్యావేత్త టోలిచౌకి వీనస్ విద్యాసంస్థల చైర్మన్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్ అన్నారు. గోల్కొండ కోటలో కేంద్ర ప్రభుత్వ పర్యాటక సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో గత వారం జరిగిన చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో సోమవారం ఆయన గోల్కొండ కోటను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. శతాబ్దాల చరిత్ర గల కట్టడాలు ఎన్నో హైదరాబాద్ నగరంలో ఉన్నాయని, వీటిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు.



బడిగంట మోగింది



అత్తాపూర్‌లో పర్యటిస్తున్న అత్తాపూర్ ప్రధానోపాధ్యాయులు సాయిప్రసాద్‌రావు, ఉపాధ్యాయులు

- పునఃప్రారంభమైన పాఠశాలలు
- ఉత్సాహంగా విద్యార్థులు తరగతులకు హాజరు
- డివిజన్ పరిధిలో ముమ్మరంగా 'బడిబాట'

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మండల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పునఃప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం నుంచి విద్యార్థులు పాఠశాలలకు తరలివచ్చారు. వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు మొదటి రోజు ఉత్సాహంగా పాఠశాలలకు హాజరయ్యారు. రాజేంద్రనగర్ మండల పరిధిలో 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, నాలుగు యూపీఎస్, 32 ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 12 వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇంతకు రెట్టింపు సంఖ్యలో మండల పరిధిలో ప్రైవేటు పాఠశాలలు కొనసాగుతున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో దాదాపు 20 వేలకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమం మండల పరిధిలో ముమ్మరంగా సాగుతోంది. పలు ప్రాంతాల్లో ఆయా స్కూళ్ల ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీలు కాలనీల్లో పర్యటిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై అవగాహన కల్పిస్తున్నారు.
- సోమవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా అత్తాపూర్ ప్రధానోపాధ్యాయులు సాయిప్రసాద్ రావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అత్తాపూర్ ప్రాంతంలోని పలు కాలనీల్లో పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజియాబేగం, ఆజామ్ ఆలీ, సరళ, మీణాకుమారి, వెంకట్‌రెడ్డి, రోజారాణి, వీరయ్య, జకీరాబేగం, జ్యోతి, బాబు, లత, లక్ష్మయ్య, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా విద్యా బోధన: డి.రామిరెడ్డి, రాజేంద్రనగర్ ఎంఈఓ

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన అందిస్తున్నట్లు రాజేంద్రనగర్ మండల విద్యాధికారి డి.రామిరెడ్డి తెలిపారు. పాఠశాలల పునః ప్రారంభమైన నేపథ్యంలో ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. పాఠశాలల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. అందులో భాగంగా చేపట్టిన 'మన ఊరు మన బడి' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, నూతన గదుల నిర్మాణాలు చేపట్టామన్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన ఇంగ్లిష్ మీడియం విద్యాబోధనతో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, ఆయా పాఠశాలలకు అందజేశామని, ఈ నెల 20న జరిగే విద్యా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఆర్టీఏ అధికారుల స్పెషల్ డ్రైవ్



రాజేంద్రనగర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్టీఏ అధికారులు

రంగారెడ్డి జిల్లా డిప్యూటీ రవాణా శాఖ కమిషనర్ ప్రవీణ్‌రావు ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ ఆర్టీఏ అధికారులు స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో సోమవారం ఉదయమే ఆర్టీఏ అధికారులు రాజేంద్రనగర్, ఆరాంఘర్, ఉప్పర్‌పల్లి చౌరస్తాలలో స్కూల్ బస్సులను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఫిట్‌నెస్ లేని, అనుమతి లేని వాహనాలను గుర్తించిన అధికారులు ఆరు బస్సులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ స్కూల్ బస్సులకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. బస్సులను ప్రమాణాలకు అనుగుణంగా ఫిట్‌నెస్ ఉండాలన్నారు. డ్రైవర్‌కు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని స్పష్టం చేశారు. తనిఖీల్లో ఎంబీఐ శ్రీధర్, సురేందర్‌రెడ్డి, విజయేంద్ర, వాసుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

అర్థం లేని ఆరోపణలు చేస్తే సహించం



మాట్లాడుతున్న అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మూడుసార్లు పోటీ చేసి ఓడిపోయి చావు దెబ్బతిన్న ఎంఐఎం నేతలు రాజేంద్రనగర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి అర్థంలేని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోరెడ్డి ధర్మారెడ్డి, పలుగుచెరువు మహేష్ అన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌పై ఎంఐఎం ఎమ్మెల్సీ రహమత్‌బేగ్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. ఉప్పర్‌పల్లిలోని డివిజన్ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ సహకారంతోనే రహమత్‌బేగ్ ఎమ్మెల్సీగా ఎన్నికైన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలుపొందిన ప్రకాష్‌గౌడ్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. 15 ఏళ్లలో ప్రకాష్‌గౌడ్ చేసిన అభివృద్ధి పనులపై తాము చర్చకు సిద్ధమని దమ్ముంటే చర్చకు రావాలని రహమత్‌బేగ్‌కు సవాల్ విసిరారు. చింతల్‌మెట్‌లో పేద ప్రజల మధ్య గొడవలు సృష్టిస్తూ సెటిల్‌మెంట్లు చేస్తున్న రహమత్‌బేగ్‌కు ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి లేదన్నారు. మరోసారి ఎమ్మెల్యేపై అనవసర ఆరోపణలు చేస్తే రాజేంద్రనగర్‌లో ఎక్కడికక్కడే ఆయనను అడ్డుకుంటామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల కారణంగా ముస్లింలు కూడా బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని గుర్తుంచుకోవాలన్నారు. నాలుగోసారి ఓడిపోయేందుకు ఎంఐఎం సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో శ్రావణ్‌కుమార్, ముజామిల్ అహ్మద్, జాన్‌పాల్, కృష్ణ, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సమష్టి కృషి



మాట్లాడుతున్న చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి

అత్తాపూర్: భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలని చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. సోమవారం హైదర్‌గూడలోని బీజేపీ కార్యాలయంలో అత్తాపూర్ డివిజన్ మోర్చాల సంయుక్త సన్నాహక సమావేశం నిర్వహించారు. అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాబాద విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల విజయవంతమైన పరిపాలనపై ప్రజలకు వివరించేందుకు మహా ప్రజా సంపర్క్ అభియాన్‌లో భాగంగా మంగళవారం శంషాబాద్ మల్లికా గార్డెన్ కన్వెన్షన్‌లో రాజేంద్రనగర్ అసెంబ్లీ పరిధిలోని మోర్చాల సంయుక్త సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి నాయకులు, కార్యకర్తలు, వివిధ మోర్చాల పదాధికారులు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. భవిష్యత్‌లో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు. అత్తాపూర్ డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా విశాల్‌ఠాకూర్‌ను నియమిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మొండ్ర కొమురయ్య, జిల్లా అధికార ప్రతినిధి రాచూరి రాజశేకర్, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సులిగె వెంకటేష్, కాడెం సుధాకర్, సిద్దేశ్వర్, ప్రధాన కార్యదర్శులు గొరిగె రాజు, సాయియాదవ్, మ్యాడం రాము, డివిజన్ యువమోర్చా అధ్యక్షులు సులిగె మణికంఠ, శ్రీరాములు, శంకర్‌సింగ్ చౌహాన్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేసి ఉన్నత స్థాయికి ఎదగాలని పయొనీర్ కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ సంరెడ్డి ప్రమోద్‌రెడ్డి అన్నారు. సోమవారం నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా స్కూల్‌కు వచ్చిన విద్యార్థులకు స్వీట్లు పంపిణీచేసి ఘనంగా స్వాగతం పలికారు. - రాజేంద్రనగర్



ఉత్సాహంగా తెలంగాణ రన్



తెలంగాణ రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాజేంద్రనగర్ టీడీపీ చౌరస్తా నుంచి బుద్వేల్ ఎక్స్‌టెన్షన్ వరకు 2కె రన్ నిర్వహించారు. కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ అర్చన జయప్రకాష్, డీసీపీ జగదీశ్వర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. పోలీసు ఉన్నతాధికారులతో పాటు ప్రజాప్రతినిధులు స్థానిక యువకులు, ఆర్డీవో, ఎమ్మార్వో, జీహెచ్‌ఎంసీ, ఉపకమిషనర్‌తో పాటు పలువురు ఈ రన్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, ఎమ్మార్వో చంద్రశేఖర్, డిప్యూటి కమిషనర్ జగన్, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ రేఖయాదగిరి, పోరెడ్డి ధర్మారెడ్డి, పలుగుచెరువు మహే, వనం శ్రీరామ్‌రెడ్డి, మహేష్, రగడంపల్లి శ్రావణ్, సాయి మాలిక్, నరేష్‌యాదవ్, సురేష్‌గౌడ్, అస్లాంబిన్ అబ్దుల్లా, రఘుయాదవ్, మలాకీ రత్నంతో పాటు మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్, నార్సింగి పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన ఎన్‌క్యూఏఎస్ బృందం



పెద్దషాపూర్ పీహెచ్‌సీని సందర్శించిన ఎన్‌క్యూఏఎస్ బృందం సభ్యులు

శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని పెద్దషాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఎన్‌క్యూఏఎస్ బృందం సందర్శించింది. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ క్వాలిటీ కార్యక్రమంలో భాగంగా ఎంపికైన ఈ పీహెచ్‌సీని ఈ బృందం పరిశీలించింది. ఈ పథకంలో పీహెచ్‌సీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరైనట్లు డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. అధికారుల బృందానికి స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ స్వాగతం పలికారు.

101వ బోనాలు ఘనంగా నిర్వహిస్తాం

గోల్కొండ: కార్వాన్ నటరాజ్ నగర్ సబ్జిమండిలోని నల్లపోచమ్మ దేవీ, మహంకాళి దేవీ మందిర కమిటీ అధ్యక్షుడిగా ప్యాట నందకిషోర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీకి జరిగిన ఎన్నికల్లో ప్యాట నందకిషోర్, కుడుముల రాకేష్ కుమార్‌ను ఏకగ్రీవంగా అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్యాట నందకిషోర్ మాట్లాడుతూ.. గతంలో కంటే ఈసారి అమ్మవార్ల బోనాలను భారీ ఎత్తున నిర్వహిస్తామన్నారు. ఆలయ కమిటీ సలహాదారులు, భక్తుల సహకారంతో బోనాలను ధూంధాంగా నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులను ఘనంగా సన్మానించారు.

బస్తీ దవాఖానాలతో పేదలకు మెరుగైన వైద్యం



గంధంగూడలో బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకే బస్తీల్లో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నట్లు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. సోమవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైద్యాన్ని మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తుందన్నారు. వీటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యం కోసం పేదలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా బస్తీ దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ విద్య, వైద్యం ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ప్రతి నిరుపేదకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. బస్తీ దవాఖానాల్లో నిపుణులైన డాక్టర్ల బృందం వైద్య సేవలు అందిస్తూ ఉచితంగా మందులను అందజేస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సృజన, కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్, స్థానిక కార్పొరేటర్లు పద్మావతిపాండు, తలారీ చంద్రశేఖర్, అస్లాంబిన్ అబ్దుల్లా, నాయకులు నాగరాజు, పాపయ్యయాదవ్, వెంకట్‌రెడ్డి, గోపాల్‌ముదిరాజ్, రాజిరెడ్డి, సయ్యద్ ఖాజా, రజాక్, కట్ట సాయిబాబాగౌడ్, మల్లేష్‌యాదవ్, యాదయ్య పాల్గొన్నారు.



కార్మికులకే మధ్యాహ్న భోజన బాధ్యతలు అప్పగించాలి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

రాజేంద్రనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణ బాధ్యతలను వంట చేసే కార్మికులకే అప్పగించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్ అన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణ బాధ్యతను అక్షయపాత్రకు అప్పగించడం సరైంది కాదని ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని రాజేంద్రనగర్, గండిపేట మండలాల మధ్యాహ్న భోజన పథకం కార్మికులు అన్నారు. ఈ మేరకు సోమవారం ఎంఈఓ రామిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్ మాట్లాడుతూ రాజేంద్రనగర్, గండిపేట మండలాల్లో ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్మికులు భోజనాన్ని వండి వడ్డిస్తున్నారన్నారు. ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం ఆలస్యమైనా వారు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని విద్యార్థులకు సకాలంలో భోజనం అందిస్తున్నారన్నారు.అయితే మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా వేసవి సెలవుల్లో 'అక్షయపాత్ర' స్వచ్ఛంద సంస్థకు ప్రభుత్వ పాఠశాలల భోజన నిర్వహణ అప్పగించడం దారుణమన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. గతంలో మాదిరిగానే పాఠశాల ఆవరణలో విద్యార్థులకు వంట చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నో ఏళ్లుగా ఇదే పనితో జీవనం సాగిస్తున్న కార్మికుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో గండిపేట మండల కన్వీనర్ డి.ప్రవణ్‌కుమార్, కార్మికులు సువర్ణ, రాణి, సాలమ్మ, అమరావతి, రమాదేవి, పోచమ్మ, జయమ్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై నిరంతర పోరాటం



వనంపల్లి జైపాల్‌రెడ్డి

రాజేంద్రనగర్: కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేస్తానని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి, ఆల్ ఇండియా మున్సిపల్ ఫెడరేషన్ కౌన్సిల్ సభ్యులు వనంపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. ఆల్ ఇండియా మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐటీయూసీ) 6వ జాతీయ మహాసభల్లో ఆయనను ఆల్ ఇండియా మున్సిపల్ ఫెడరేషన్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో ఈ నెల 11, 12 తేదీల్లో రెండు రోజుల పాటు మహాసభలను జరిగాయన్నారు. మహాసభలో రంగారెడ్డి జిల్లా నుంచి ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా తనను ఆల్ ఇండియా మున్సిపల్ ఫెడరేషన్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు, కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటాలు చేపడతానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన తెలంగాణ రాష్ట్ర, ఆల్ ఇండియా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పలువురికి గాయాలు



పాల్మాకులలో ప్రమాదానికి కారణమైన ట్రాన్స్‌ఫార్మర్

శంషాబాద్ రూరల్: విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల కారణంగా గృహోపకరణాలకు విద్యుత్ సరఫరా కావడంతో పలువురు గాయపడిన సంఘటన పాల్మాకుల గ్రామంలో చోటు చేసుకుంది. ట్రాన్స్‌కో అధికారుల వైఖరిని నిరసిస్తూ గ్రామస్తులు సోమవారం ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే..గ్రామంలోని ఎస్సీ కాలనీకి విద్యుత్ సరఫరా అయ్యే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల కారణంగా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కొందరి ఇళ్లల్లో గృహోపకరణాలకు విద్యుత్ సరఫరా కావడంతో వాటిని ముట్టుకున్న పలువురు వ్యక్తులు గాయపడ్డారు. ఇటికెల రవళికి కాలి వేళ్లకు తీవ్ర గాయాలవడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. దీంతో స్థానికులు సోమవారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆందోళన చేపట్టారు. కరెంటు తీగలను సరి చేయకుండా ప్రమాదాలకు కారణమవుతున్న అధికారులు, సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి



ఏ.నరేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

మణికొండ: ప్రజలకు సేవలు అందించేందుకు యువత ముందుకు రావాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపల్ పరిధిలోని మణికొండ క్వార్టర్స్(వీకర్ సెక్షన్ కాలనీ)లో దివ్య జ్యోతి యూత్ అసోసియేషన్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు ఏ.నరేష్ యూత్ అధ్యక్షుడిగా విజయం సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ నరేష్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ యువత తలచుకుంటే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించవచ్చునన్నారు. నరేష్ బీఆర్‌ఎస్ పార్టీలో చురుకైనా కార్యకర్తగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. వీకర్ సెక్షన్ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని నరేష్‌కు సూచించారు. కాలనీ అభివృద్ధికి సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందిస్తానని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు శ్రీరాములు, జంగయ్య, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు శ్రావణ్, రాఘవేందర్, శ్రీకాంత్, కుమార్, భానుచందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నల్ల పోచమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్‌పల్లిలోని నల్ల పోచమ్మ దేవాలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయ ధర్మకర్త రేసు నర్సింహారెడ్డి, రేసు భుజంగారెడ్డి ఆధ్వర్యంలో దేవాలయాన్ని వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. ఉదయం గణపతి పూజ, కలశస్థాపన పూజ, అమ్మవారికి పంచామృత అభిషేకం, హోమం, పూర్ణాహుతి, మహాహారతి, సంప్రోక్షణ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నదాన ఉప్పర్‌పల్లితో పాటు చుట్టు పక్కల ప్రాంతాల భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంత్‌రెడ్డి, శివారెడ్డి, జి.శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.